సాక్షి
వికారాబాద్
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



దాడులు అప్రజాస్వామికం

దళిత యువకుడిపై మూకుమ్మడిగా దాడికి పాల్పడడం అమానుషమని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. 17లో▸



క్రీడాకారులకు ప్రోత్సాహం

యువత క్రీడల్లో రాణించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. 17లో▸



అభివృద్ధి దిశగా..

జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ నిఖిల అధికారులకు సూచించారు. 18లో▸

న్యూస్‌రీల్

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోండి



యాద్గిర్‌లో కార్గో సేవలను ప్రారంభిస్తున్న ఎగ్జిక్యూటివ్ మెంబర్ విశ్వనాథ్ గౌడ్

పరిగి: ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను వినియోగించుకోవాలని పరిగి డిపోకు చెందిన లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ విశ్వనాథ్ గౌడ్ తెలిపారు. బుధవారం కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ బస్‌స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను తాండూరు, వికారాబాద్ డిపోలకు చెందిన లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మెంబర్లు చంద్రయ్య, వసంత్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ పట్టణం నుంచి హైదరాబాద్ నగరానికి అనేక మంది ప్రయాణిస్తుంటారని అన్నారు. నగరానికి ఎగుమతులు, దిగుమతులు చేసుకునే వ్యాపారస్తులు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. తాము అన్ని విధాలా సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. చాలా తక్కువ మొత్తంలో సర్వీస్ చార్జీలు వసూలు చేస్తోందని తెలిపారు. కర్ణాటకలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు ఈ సేవలను అందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్ సేవల కోసం యాద్గిర్ ఏజెంట్ 82177 51618, పరిగి ఏజెంట్ 73828 38412 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు కేటాయించండి



పాలడెయిరీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పాడిరైతులు

పరిగి: ఏళ్లుగా పాడి రైతులు మదర్‌డెయిరీ అభివృద్ధికి కృషి చేస్తుంటే కొంతమంది నాయకులు అన్యాయం చేస్తున్నారని డెయిరీ చైర్మన్లు మండిపడ్డారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మదర్‌డెయిరీ పాలశీతలీకరణ కేంద్రం ఎదుట డెయిరీ చైర్మన్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పాలశీతలీకరణ దుకాణ సముదాయాలను పాడిరైతులకు కేటాయించాలని డెయిరీ మెనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996 ముందు నుంచే మదర్‌డెయిరీకి పాలు అందిస్తున్నామన్నారు. పాలు అందిస్తున్న రైతులకే దుకాణాలను ఇస్తామని చెప్పి ఇప్పుడు రాజకీయ నాయకులకు ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆయ గ్రామాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

మనబడిని కాపాడుకుందాం

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్




చంద్రాయన్‌పల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: సర్కారు బడులను కాపాడటమేకాకుండా అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లి, అంరాధికుర్దు గ్రామాలలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో చేపట్టిన పాఠశాలలను ప్రారంభించారు. ఒక్కో పాఠశాలకు సుమారు రూ.14లక్షల మేర నిధులను వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. తరగతి గదులకు మరమ్మతులు, నూతన మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్లు, ఫర్నిచర్, పాఠశాల ఆవరణను సుందరీకరణ చేయడం వంటి పనులను చేపట్టామన్నారు. మరోవైపు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

ప్రగతి బాటన గ్రామాలు

పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. అంరాధికుర్దులో రూ.20లక్షల నిధులతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎంపీపీ డి.వసంత, సర్పంచులు అంజయ్య, సునీత, ఎంపీటీసీలు రోజ, శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరిశంకర్, ఎంఈఓ గోపాల్, నాయకులు తదితరులు ఉన్నారు.

మళ్లీ మొండిచెయ్యే!



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు మరోసారి మొండిచేయి చూపారు. కేంద్రబడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు నేరుగా మేలు చేకూర్చే పథకాలేవీ కనిపించడంలేదని పరిశీలకులు అంటున్నారు. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్, వికారాబాద్– కృష్ణా రైల్వే లైన్ ప్రస్తావన లేకపోవడంతో జిల్లా ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు.

నిరాశపరిచిన కేంద్రబడ్జెట్

- కానరాని ఎంఎంటీఎస్ ప్రస్తావన
- ఊసేలేని వికారాబాద్–కృష్ణా రైల్వేలైన్
- పట్టని పర్యాటక అభివృద్ధి

వికారాబాద్: కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు పరోక్ష లబ్ధి మినహా ప్రత్యక్షంగా ఎలాంటి కేటాయింపులు జరగలేదు. బడ్జెట్‌లో జిల్లా వాసులకు ఈ సారి కూడా నిరాశే ఎదురయ్యింది. వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్‌కు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయిని ఆశించారు. రైల్వేలైన్ ప్రస్తావనే లేకపోవడంతో మరోసారి జిల్లావాసులు నిరాశచెందారు. అదే విధంగా జిల్లాలో ఎంఎంటీఎస్ రైలు పొడిగింపు ప్రస్తావించలేదు. ఉద్యోగులు, విద్యార్థులు అధికంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా లింగంపల్లి నుంచి వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలును పొడిగించాలని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. జిల్లా కేంద్రంలో రైల్వే లైన్ ఉన్నా పలు చోట్ల అండర్ పాస్‌లు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. వీటికి సంబంధించి కూడా బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. నావన్గి రైల్వేస్టేషన్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపడంతో పాటు పల్నాడు ఎక్స్‌ప్రెస్ తాండూరు వరకు పొడిగించడం, తాండూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి తదితర అంశాలకు మన ఎంపీ ప్రతిపాదనలు పంపించగా అవేవి బడ్జెట్‌లో కనిపించలేదు. పర్యాటక శాఖ మంత్రి హైదరాబాద్‌కు చెందినవారే ఉన్నప్పటికీ అనంతగిరి పర్యాటక కేంద్రం అభివృద్ధి ప్రస్తావన లేదు. కొన్నేళ్లుగా పాలమూరు –రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వస్తున్నా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు.

ఏకలవ్య పాఠశాలలు..

జిల్లాలోని పరిగి, తాండూరు, కుల్కచర్ల, తదితర ప్రాంతాలలో గిరిజనులు అధికంగా ఉన్నారు. ఈ ప్రాంతాలలో ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు రానున్నాయి. అదే విధంగా ఒకటవ తరగతి నుంచి ఉన్నత పాఠశాల వరకు డిజిటల్ విద్యా బోధనను చేస్తామని ప్రకటించడంతో జిల్లాలోని 1063 పైగా పాఠశాలల్లోని విద్యార్థులకు మేలు చేకూరనుంది.

మౌలిక వసతులకు పెద్దపీట

ఈ ఏడాదినుంచి వరుస ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, వసతులకు పెద్దపీట వేశారు. గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ కేటాయించారు.ఆదాయ పన్నుల విధింపులో కొత్త విధానం రూపొందించడంతో మధ్య తరగతి వేతన జీవులకు కాస్త ఉపశమనం లభించినట్టయ్యింది. వ్యవసాయంలో స్టార్టప్‌లకు నిధుల కేటాయింపు, చిరుధాన్య పంటలను ప్రోత్సహించేందుకు కేటాయింపులు వ్యవసాయ ఆధారిత మన జిల్లాకు లబ్ధి చేకూరనుంది. మన జిల్లాలో ఎక్కువ శాతం చిరుధాన్యాలు పండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ పంటలు పండించే రైతంగానికి ఊతమివ్వనుంది. ఉద్యాన పంటలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడంతో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం లభించనుంది. మహిళలు, బాలికలకు సైతం పలు పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించే చర్యలను బడ్జెట్‌లో ప్రస్తావించడం శుభపరిణామం.

జిల్లాకు ఒరిగిందేమీలేదు



జిల్లాగా ఏర్పడకముందు నుంచే వికారాబాద్ ఎడ్యుకేషన్ హబ్‌గా ఉంది. ఈ ప్రాంతానికి పలు ప్రాంతాల నుంచి విద్యను అభ్యసించడానికి నిత్యం సుమారు 10వేల మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రవాణా సౌకర్యం సరిపోనులేదు. లింగంపల్లి నుంచి వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలు, వికారాబాద్–మక్తల్ కొత్త లైను ఏర్పాటు, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపాలని కొన్నేళ్లుగా కోరుతున్నాం. ఈసారైనా బడ్జెట్‌లో నిధులు ఇస్తారని ఆశించాం. కానీ రైల్వే పరంగా ఒరిగిందేమీలేదు.

– మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాలకు సమన్యాయం



ఎంతో శ్రమపడే రైతాంగానికి కేంద్ర బడ్జెట్ ఊరట కలిగించింది. రైతులకు రెట్టింపు ఆదాయం చేసే దిశలో బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం వ్యవసాయానికి ఎంతో ఊత మిస్తుంది. ప్రత్యేకంగా గిట్టుబాటు ధర కల్పించడానికి కేంద్రం నిర్ణయం తీసకోవడం సంతోషకరం. ఉద్యాన పంటలకు చేయూత, వ్యవసాయంలో స్టార్టప్‌లకు నిధుల కేటాయింపు, మహిళల కోసం ప్రత్యేక నిధులు ఇలా ఈ బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం చేసేదిగా ఉంది.

– ఏ. చంద్రశేఖర్, మాజీ మంత్రి, బీజేపీ నేత

చారిత్రక పరిణామం



కేంద్ర బడ్జెట్‌లో మహిళల అభ్యున్నతికి నిధుల కేటాయింపు, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా చర్యలు చేపట్టడం చారిత్రక పరిమాణం. గిరిజన ప్రాంతాలలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఏకలవ్య గురుకుల పాఠశాలల స్థాపనకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఇది షెడ్యూలు కులాల అభ్యున్నతికి దోహదపడుతుంది. ఆదాయ పన్ను పరిమితి వేతన జీవులకు మేలు చేసేలా ఉంది. డిజిటల్ విద్యకు ప్రాధాన్యతనివ్వటం, తదితర అంశాలు భవిషత్తులో మంచి ఫలితాలనిస్తుంది.

– డాక్టర్ భాస్కరయోగి, రాజకీయ విశ్లేషకుడు

అంకెలగారడే..



ప్రజలు ఆశించిన విధంగా రాష్ట్రానికి మేలు జరగలేదు. పేదలను కొట్టి పెద్దలకు పెట్టే విధంగా బడ్జెట్ ఉంది. తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం చేశారు. వెనుకబడిన వికారాబాద్ జిల్లాకు ప్రయోజనం చేకూర్చే అంశాలేమీ పొందుపరచలేదు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త రైల్వే లైన్లకు కేటాయింపులు లేవు. ఎంఎంటీఎస్ రైలు పొడిగింపు అంశం కూడా లేదు. పర్యాటకంగా అభివృద్ధికి అవకాశమున్న జిల్లాలో నిధులు ఇవ్వడంలో కేంద్రం పక్షపాత వైఖరికి చూపింది.

– గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ నేత

రాష్ట్రానికి అన్యాయమే



పూడూరు: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పాలమూరు– రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వక పోగా, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కేసులు వేసి అడ్డుకుంటోంది. గడిచిన ఎనిమిదేళ్లలో రాష్ట్రానికి కేంద్రం ఇచ్చింది ఏమీలేదు. ఉపాధిహామీ నిధులను సైతం వెనక్కి తీసుకుని రాష్ట్రంపై వివక్ష చూపుతోంది. విద్య, వైద్య పరంగా అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయం.

– కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే



ఏన్కతలలో శివభక్తుల ఊరేగింపు

వైభవంగా ఘటాభిషేకం



ఏన్కతల గ్రామంలో బుధవారం శివ భక్తులు ఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం భవానీమాత ఆలయం నుంచి శివ మాల ధరించిన శివభక్తులు 108మంది నర్మదా మాత ఆలయానికి కుండలలో నీటిని తీసుకెళ్లి ఘటాభిషేకం చేశారు. భాజా భజంత్రీలు, డప్పు వాయిద్యాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. శనైశ్చరస్వామి ఆలయ ప్రాంగణంలోని నర్మదామాత కు జలాభిషేకం చేశారు.

– మోమిన్‌పేట

పన్నులు తగ్గించాలి

- కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్‌లో పన్నుల తగ్గింపుపై పాలకవర్గం తీర్మానం చేయకపోతే ప్రజలతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేటలోని పార్టీ జిల్లా ఆఫీసులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటి పన్నులను తగ్గించేందుకు సమీక్ష నిర్వహించాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇవ్వడం శుభ పరిణామమన్నారు. ఈ అంశాన్ని కౌన్సిల్‌లో పెట్టి వెంటనే తీర్మానం చేయించాలని డిమాండ్ చేశారు. ఇంటి పన్నుల విషయంలో అధికారుల వద్ద సరైన సమాధానం లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గత సెప్టెంబరు 9న మీర్‌పేట పాలకవర్గం కౌన్సిల్ సమావేశం జరిగిందని, 90 రోజులకు ఒకసారి మీటింగ్ నిర్వహించాల్సి ఉండగా, 150 రోజులు పూర్తయినా ఏర్పాటు చేయలేదని, ఇలాగైతే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ఇంటి పన్నులతో పాటు పాటు నల్లా బిల్లులు కూడా తగ్గిస్తామని మున్సిపల్ ఎన్నికలకు ముందు ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. సమావేశంలో చల్లా బాల్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసి ఏడేళ్లు
పాలమూరుకు ఇంకెన్నాళ్లు?

- ముందుకు సాగని ఎత్తిపోతల పనులు
- వీడని పర్యావరణ కష్టాలు
- బీడు భూములకు సాగునీరు అందేదెన్నడో?



నిర్మాణంలో ఉన్న కరివెన రిజర్వాయర్

కొడంగల్: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ముందుకు సాగడంలేదు. పథకానికి శంకుస్థాపన చేసి ఏడేళ్లు గడుస్తున్నా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. 'కృష్ణా జలాలను కొడంగల్‌కు రప్పించి రైతన్నల కాళ్లు కడుగుతా.. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి బీడు భూములను సస్య శ్యామలం చేస్తా'నంటూ మంత్రి కేటీఆర్ 2018 డిసెంబర్‌లో కొడంగల్‌కు వచ్చి నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. మంత్రి హామీ సైతం నాలుగేళ్లు దాటింది. ఇప్పటి వరకు పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పనుల్లో పురోగతి లేదు. జిల్లా దరిదాపులకు కూడా రాలేదు. పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

తొలగని అడ్డంకులు

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అడ్డంకులు తొలగడంలేదు. న్యాయ వివాదాలతో పనులు ముందుకు సాగడం లేదు. పర్యావరణ అనుమతులు లేని కారణంగా ప్రాజెక్టు నిర్మాణ పనులను ఆపాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులను సాధించడం కోసం అధికారులు కృషి చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు తీసుకోకుండా పనులు చేసినందుకు గత నెలలో జాతీయ హరిత ట్రిబ్యునల్ రూ.920 కోట్ల జరిమానా విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణకు రావాల్సి ఉంది. ఈ ఏడాది చివరిలోగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని గతంలో నిర్ణయించారు. ప్రాజెక్టు మొత్తంగా ఆరు రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉంది. తొలి విడతలో నాలుగు రిజర్వాయర్లు నార్లపూర్, ఏదుల, వట్టెం, కరివెనకు శ్రీశైలం జలాశయం నుంచి నీళ్లను ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు బిగించారు. చివరి రెండు రిజర్వాయర్లు ఉద్దండాపూర్, లక్ష్మీదేవిపల్లికి నీళ్లను పంపింగ్ చేసే పంపులు మోటార్లను బిగించాల్సి ఉంది. నిర్మాణ పనులు కూడా అసంపూర్తిగా ఉన్నాయి.పథకం పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో.. జిల్లాకు రావడానికి ఎన్ని ఏళ్లు పడుతుందోనని ఈ ప్రాంత రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

2015లో భూమి పూజ

కరువు కాటకాలు వలసలతో జీవకళ కోల్పోయిన పాలమూరు జిల్లాకు, సాగునీటి వనరులు లేని రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతానికి కృష్ణా నది నీటిని అందించి బీడు భూముల్లో బంగారు పంటలు పండించాలనే ఉద్దేశంతో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. 2015 జూన్ 11న ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి ఏడేళ్లు అవుతున్నా పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దక్షిణ తెలంగాణా ప్రాంతంలో 'పాలమూరు – రంగారెడ్డి' ఎత్తిపోతల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. అయితే క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిపై విమర్శలు వస్తున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలోని బీడు భూములకు సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులను వేగవంతం చేసి ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కానరాని పురోగతి

నార్లపూర్, ఏదుల, వట్టెం, కరివేన రిజర్వాయర్ల నుంచి నీటిని తరలించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రావిటీ ద్వారా చెరువులను నింపి అక్కడి నుంచి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. గత బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.960 కోట్లు కేటాయించింది. నిధులున్నా పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు లక్ష్మీదేవ్‌పల్లి రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు నీటిపారుదల శాఖాధికారులు చెబుతున్నారు. రిజర్వాయర్ల నుంచి చెరువులు.. చెరువుల నుంచి పంట పొలాలకు సాగునీరు పంపిణీ చేస్తామంటున్నారు.

సాగునీరు అందిస్తాం



నియోజకవర్గ రైతులకు సాగునీరు లేకపోవడం వల్ల పంటలు పండించడానికి కష్టంగా ఉంది. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాను. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పనులను వేగంగా పూర్తి ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరాను.నియోజకవర్గంలో రెండు లక్షల 19వేల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి ఎకరాకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తా ను. కోర్టు కేసుల కారణంగా ఆలస్యం అవుతోంది. న్యాయస్థానం తీర్పు రాగానే పనులు పూర్తి అవుతాయి.

– నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కొడంగల్

సమన్వయంతో పనిచేయండి

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

అనంతగిరి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సూచించారు. జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. ఆయా శాఖల అధికారులు నిర్దిష్ట ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు. ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఉపాధిహామీ, విద్యుత్, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలలో ఇప్పటివరకు జరిగిన పురోగతి పనుల వివరాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అన్ని కమిటీల నిర్వహణపై సమీక్ష చేశారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే క్యాంపుల వద్ద ప్రజలకు, వైద్య సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. అందుకు గాను సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

క్లుప్తంగా

రేపు ఎల్లమ్మ రథోత్సవం



అమ్మవారి ఆలయం

కొడంగల్: పట్టణ శివారులో వెలిసిన బండల ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం శుక్రవారం సాయంత్రం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త రాంరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని రాంరెడ్డి నివాసం నుంచి ఆలయం వరకు అమ్మవారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గురువారం ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం బోనాలు, సాయంత్రం రథోత్సవం, శనివారం సాయంత్రం ఎద్దులతో ఊరేగింపు, ఆదివారం సాయంత్రం పెరుగు బసంతం ఉంటుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ ధర్మకర్తలు కోరారు.

దర్గాలో జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక ప్రార్థనలు



ఆలంపల్లి దర్గా వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో గల హజ్రత్ ఆలం షహీద్ రహ్మతుల్ల హుస్సేన్ దర్గాలో బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ సునీత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆమె వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, యువజన విభాగం రాష్ట్ర నాయకులు వడ్ల నందు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న రామ్‌చరణ్, శివసాయి

కుల్కచర్ల: సౌత్‌ఇండియా సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు ప్రతిభ చాటారు. చౌడాపూర్ మండలం మరికల్ జెడ్పీ పాఠశాలలో రామ్‌చరణ్ చారి, శివసాయి 9వ తరగతి చదువుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వీరు కేరళ రాష్ట్రంలో జనవరి 27నుంచి 31వ తేదీ వరకు జరిగిన సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌లో ద్వితీయస్థానాన్ని సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులు నీటితో వాహనాలు నడిపే విధానాన్ని ప్రదర్శించి ప్రతిభ చాటారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాండూరు: ఇసుక అక్రమ రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఖాంజాపూర్ వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తాండూరుకు తరలిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున పోలీసులు గస్తీ నిర్వహించి పట్టణంలోని సాయిపూర్ ప్రాంతంలో ఇసుకను ఖాళీ చేస్తుండగా పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యాజమాని సికిందర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

జూదరులపై కేసు

తాండూరు: మట్కా ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. తాండూరులోని గాంధీనగర్‌కు చెందిన స్టార్ స్పోర్ట్స్ బృందం పేరిట మట్కా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మట్కా స్థావరంపై దాడి చేశారు. మట్కా చిట్టీలతో పాటు రూ. 8,100 నగదు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మట్కా ఆడుతున్న గోపాల్‌రెడ్డి, వెంకటేష్, షేక్ వసీం, మధుకర్, కృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రారంభం

టాస్ వేసి ప్రారంభించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, 'సాక్షి' సీజీఎం కమల్‌కిశోర్‌రెడ్డి

- క్రీడా స్ఫూర్తి అవసరం: సాక్షి సీజీఎం కమల్‌కిశోర్‌రెడ్డి
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

SAKSHI PREMIER LEAGUE | SAKSHI DIGITAL MEDIA GROUP

ఘట్‌కేసర్: 'సాక్షి' యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్-4 (ఎస్‌పీఎల్) బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానం క్రీడా సంబురానికి వేదికైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 65 జట్లు ఎస్‌పీఎల్‌లో పాల్గొంటున్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన (సాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ టాస్ వేసి లీగ్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథి ఆంజనేయగౌడ్, 'సాక్షి' మీడియా గ్రూప్ సీజీఎం కమల్ కిశోర్‌రెడ్డి సరదాగా బ్యాటింగ్, బౌలింగ్ వేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. వారితో పాటు ఏజీఎం ఉగ్రగిరిరావు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం వెలికితీయడం అభినందనీయం...

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ... పుట్టుకతోనే ఎవరూ విజేతలు కాలేరని, చిత్తశుద్ధితో చేసే ప్రయత్నంతోనే విజయం వారికి సొంతం అవుతుందన్నారు. సాధారణ, రాజకీయ వార్తలే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు 'సాక్షి' యాజమాన్యం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

- తొలి అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్ విజేత జట్టు కీడాకారిణి భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు చెందిన త్రిషను ఆదర్శంగా తీసుకొని ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని సూచించారు.
- ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రతిభ గల గ్రామీణ క్రీడాకారులను 'సాక్షి' మీడియా ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు. క్రీడలతో ఐక్యత భావం పెరుగుతుందని, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు.
- సీజీఎం కమల్ కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ... గెలుపు ఓటములు సహజమని, క్రీడల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు.
- కార్యక్రమంలో 'సాక్షి' ఏజీఎం ఉగ్రగిరిరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-1

- మొదటి మ్యాచ్‌లో ఐఏంసీ ఖైరతాబాద్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన సైదాబాద్ మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 59 పరుగులు చేసి విజేతగా నిలిచింది.
- రెండవ మ్యాచ్‌లో మొఫ్కంజా కళాశాల జట్టు, ఇబ్రహీంపట్నం శ్రీదత్తా ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై గెలుపొందింది. మొఫ్కంజా క్రీడాకారుడు అఫాన్ 29 బంతుల్లో 51 పరుగులు చేశాడు. మూడవ మ్యాచ్‌లో శ్రేయ ఇంజినీరింగ్ కళాశాల-బి జట్టు, వైష్ణవి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల జట్టుపై గెలుపొందింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-2

- మొదటి మ్యాచ్‌లో వేదా డిగ్రీ కళాశాల జట్టు, అంబేడ్కర్ డిగ్రీ కళాశాల జట్టుపై అలవోకగా విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో వెస్లీ డిగ్రీ కళాశాల-ఎ జట్టు, శ్రేయ ఇంజినీరింగ్ కళాశాల జట్టు-ఏ పై గెలుపొందింది. మూడవ మ్యాచ్‌లో విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు, ప్రగతి డిగ్రీ జట్టు పోటీపడగా 10 ఓవర్లలో ఇరు జట్లు 108 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. ఈ సందర్భంగా వేసిన సూపర్ ఓవర్ విజేతను వరించింది.
- సూపర్ ఓవర్‌లో మొదటి బ్యాటింగ్ చేసిన ప్రగతి జట్టు 6 బంతుల్లో 26 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ జట్టు 22 పరుగులు చేసి ఓటమి చవిచూసింది.
- విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు క్రీడాకారుడు కలీం 56 పరుగులు చేయగా, ప్రగతి జట్టు క్రీడాకారుడు మోహన్ 46 వ్యక్తిగతంగా అత్యధికంగా పరుగులు చేశాడు.







'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

అనంతగిరి: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి సీనియర్ న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. బుధవారం వికారాబాద్ కోర్టు ఆవరణలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, జూనియర్ జడ్జి శ్రీకాంత్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, సంపూర్ణ ఆనంద్, నాగరాజు, యాదవరెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

రోహిత్‌రెడ్డి శిబిరంలోకి కౌన్సిలర్ వెంకన్నగౌడ్

తాండూరు: మున్సిపల్ కౌన్సిలర్ వెంకన్న గౌడ్ బుధవారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శిబిరంలోకి మారారు. చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడితే టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ల మద్దతు అవసరం ఉంటుంది. అయితే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గత ఎన్నికల్లో తన అనుచరగణానికి టికెట్లు ఇచ్చినా గెలవలేకపోయారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అనుచరగణం మెజారిటీ స్థాయిలో విజయం సాధించారు. మూడేళ్ల తర్వాత ఎమ్మెల్సీ వర్గంలో నుంచి కొందరు కౌన్సిలర్లు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శిబిరంలోకి వెళ్లారు. తాజాగా 8వ వార్డు కౌన్సిలర్ వెంకన్నగౌడ్ చేరారు. దీంతో ఆయన్ను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. నాయకులు పట్లోళ్ల నర్సింహులు, విఠల్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

కౌన్సిలర్ బొంబిన

తాండూరు: మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చాలని ఏడీఈ ఆదినారాయణకు కౌన్సిలర్ పీపీ బొంబిన వినతిపత్రం అందజేశారు. బుధవారం వారు మాట్లాడుతూ వార్డులోని కర్బల మైదానం ఏరియా, మున్సిపల్ క్వాటర్స్, ఫాతిమా మజిత్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వాటిని తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని ఏడీఈని కోరారు.

భౌతిక దాడులు అప్రజాస్వామికం

- దళిత యువకుడిపై దాడి అమానుషం
- నిందితులపై కేసు నమోదు చేయాలి
- దళిత సంఘం నాయకుల డిమాండ్
- డీఎస్పీ, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘం నాయకులు

యాలాల: శివమాలధారుడి పట్ల అనుచితంగా ప్రవర్తించారని పేర్కొంటూ దళిత యువకుడిపై మూకుమ్మడిగా దాడికి పాల్పడడం అమానుషమని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. దళిత యువకుడు అనుచితంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలనే కానీ, భౌతిక దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు దళిత సంఘాల ఆధ్వర్యంలో తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, తహసీల్దార్ గోవిందమ్మకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన నరేష్‌ను మంగళవారం సాయంత్రం పీఎస్ ఎదుట వంద మందికి పైగా శివస్వాములు భౌతిక దాడికి దిగడం అన్యాయమన్నారు. మాలధారణలో ఉన్న స్వాములు కర్రలు, రాళ్లతో నరేష్‌పై మూకుమ్మడిగా చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితుడిని శివస్వాముల దాడి నుంచి యాలాల ఎస్ఐ అరవింద్‌కుమార్ రక్షించకపోతే మృతి చెందేవాడన్నారు. మాలధారణలో ఉన్న వ్యక్తులు పోలీసులను సైతం లెక్కచేయకుండా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. నరేష్‌పై దాడికి దిగిన ప్రతి ఒక్కరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున దళిత సంఘాలతో న్యాయ పోరాటానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. నరేష్‌పై మూకుమ్మడి దాడి వెనుక రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారని పలువురు ఆరోపించారు. ఈ విషయంలో పోలీసులు చట్టపరంగా కేసులు నమోదు చేసి దాడులకు పాల్పడ్డ వారిని రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నాయకుల ముందస్తు అరెస్టు

కాగా మంగళవారం సాయంత్రం జరిగిన ఘటన నేపథ్యంలో దళిత సంఘాల నాయకులు బుధవారం ధర్నాకు పిలుపునిచ్చాయి. విషయం తెలుసుకున్న పోలీసులు శాంతి భద్రతల నేపథ్యంలో దళిత సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసినప్పటికీ, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, దళిత మహిళలు పెద్ద సంఖ్యలో యాలాల మండల కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం డీఎస్పీ, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఘటన నేపథ్యంలో యాలాల తహసీల్దార్ కార్యాలయంతో పాటు పీఎస్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. కార్యక్రమంలో కేఎస్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలి మల్కయ్య, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హక్కులు పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, బీఎస్‌పీ తాండూరు ఇన్‌చార్జ్ అరుణ్ రాజ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మెట్లి ఆశన్న, దళిత సంఘాల నాయకులు మహేందర్, రత్నం, వెంకటేష్; మెట్లి కృష్ణ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి: పరిగి నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ఎమ్మెల్యే లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 3న నిర్వహించే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే నియోజకవర్గానికి నిధులు తీసుకురావాలని కోరారు. నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. కుల్కచర్ల మండలం వెంకటపూర్ సమీపంలో నిర్మించిన డబుల్ ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. రంగాపూర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. రోడ్ల విస్తరణ తదితర సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, రాఘురాం, వెంకటయ్య, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీరులకు ఘన సన్మానం



అగ్నిపత్ అభ్యర్థులను సన్మానిస్తున్న సర్పంచ్

దోమ: మండలంలోని బొంపల్లి పాఠశాలలో చదువుకున్న ముద్దం నందు యాదవ్, చంద్రకంటి పవన్ కుమార్ ముదిరాజ్ అగ్నిపత్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని సర్పంచ్ కోళ్ల సురేశ్, ఎంపీటీసీ రాములు అన్నారు. బుధవారం వారిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ పట్టుదలతో ముందుకు వెళితే విజయాలు వాటంతట అవే వరిస్తాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థీ ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధతో వింటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరిలాల్, ఉప సర్పంచ్ రఫీక్ పాషా, వార్డు సభ్యుడు బోయిని చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల చైర్మన్ షఫీ, చైర్మన్లు అనంతయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శుభప్రద్‌పటేల్

రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్

యాలాల: యువత క్రీడల్లో రాణించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీనారాయణపూర్‌లో శుభప్రద్ పటేల్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేసీఆర్ ట్రోఫీ క్రికెట్ పోటీలను జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్రామీణ క్రీడాకారులకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, పోటీ ప్రపంచానికి తగినట్టుగా క్రీడలు, చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా ఆణిముత్యాలను గుర్తించేందుకు ఇటువంటి టోర్నీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, కాసేపు వారితో క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో పెద్దేముల్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ధన్‌సింగ్, శుభప్రద్ పటేల్ యువసేన సభ్యులు భాను, కుర్వ బాలు, రాముగౌడ్, నరేష్‌గౌడ్, విజయ్, హరీష్, శ్రీశైలం, ప్రశాంత్, నాయకులు సచిన్, శాంతప్ప, లక్ష్మణ్, సతీష్, చందు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రంగారెడ్డి మృతదేహం

అనంతగిరి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన సంఘటన వికారాబాద్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెండ్లిమడుగు గ్రామానికి చెందిన జీ రంగారెడ్డి(35) బుధవారం సాయంత్రం పొలం పనులు చేస్తూ మోటారును ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



పెద్దేముల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి



పూడూరు: కందనెల్లిలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కందనెల్లి ప్రాథమిక పాఠశాలలోమన ఊరు - మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ విద్యార్థుల కష్టాలు తీర్చేందుకే మన ఊరు - మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు రూ. 14.50లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, ఎంపీపీ అనురాధ, వైస్ ఎంపీపీ మధులత, సర్పంచ్ మోహన్‌రెడ్డి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌చారి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ధన్‌సింగ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వసతుల కల్పనకే 'మనఊరు - మనబడి' ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకే సీఎం కేసీఆర్ మనఊరు - మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మన్నేగుడలో మన ఊరు మన బడి ద్వారా ఆధునీకరించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయన్నారు. ప్రైవేటుకు దీటుగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచ్ వినోద్‌గౌడ్, ఎంఈఓ హరిశ్చందర్, ఎంపీటీసీ మస్రత్ ఆదిల్, ఉప సర్పంచ్ హసీబ్, ఎస్‌ఎంసీ చైర్మన్ తిరుపతి, నాయకులు దయానంద్‌గౌడ్, జాహెద్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి

పరిగి: పార్టీలకు అతీతయంగా సీఎం సహాయ నిధి పథకం అమలవుతోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన గీత అనారోగ్యానికి గురి కావడంతో బుధవారం తన నివాసంలో రూ. 2.5లక్షల ఎల్‌ఓసి చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని, అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సీఎం సహాయ నిధి ఎంతో మందికి మేలు చేస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏ ఒక్కరికీ సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చులకు డబ్బులు వచ్చేవి కాదన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నియోజకవర్గంలో వేల మందికి సీఎం సహాయ నిధి ద్వారా మేలు చేకూరిందన్నారు. మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, కుదావన్‌పూర్ సర్పంచ్ గోపాల్, మైనార్టీ నాయకులు హాజీపటేల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

దోమ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత పొందవచ్చని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమ మండలం గుండాల అనుబంధ గ్రామమైన తండాలోని హనుమాన్ ఆలయంలో మహాగణపతి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు దైవభక్తిపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అప్పుడే మానసిక ప్రశాంతత పొందవచ్చని అన్నారు. జెడ్పీటీసీ నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ లక్ష్మయ్య ముదిరాజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సుభాష్ నాయక్, బీఆర్‌ఎస్ నేతలు నారాయణ, జగత్‌రెడ్డి పాల్గొన్నారు.